క్లుప్తంగా

ఆగమోక్తంగా సంకట చతుర్థశి


హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద శనివారం ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలను అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి హోమం చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రమణమహర్షి జయంతి

రేణిగుంట: సద్గురు రమణ మహర్షి 144వ జయంతి వేడుకలు శనివారం రేణిగుంట అక్షయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. అలాగే రేణిగుంట పాత విమానాశ్రయ మార్గంలో ఉన్న అక్షయ క్షేత్రంలో మానసిక వికలాంగులకు జీపాళెం వైఎస్సార్ సీపీ నాయకుడు వేణు ముదిరాజ్, మాజీ సర్పంచ్ రాణెమ్మ పండ్లు, బిస్కెట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. రమణ మహర్షి బోధనల్లో మౌనం, మౌన ముద్ర ద్వారా ఎలాంటి సమస్యనైనా శాంతియుతమార్గంలో పరిష్కరించుకోవచ్చని తాము విశ్వసించినట్లు వారు తెలిపారు. ఆయన జయంతిని మానసిక వికలాంగుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. మధురాయల్, అక్షయ క్షేత్రం నిర్వాహకులు మునిరాజ పాల్గొన్నారు.

ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నారాయణ పాఠశాలలో శనివారం ముందస్తు న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈశ్వరయ్య, ఏజీఎం కిషోర్, ఆర్ఐ సురేష్, వైస్ ప్రిన్సిపల్ కీర్తన, చూడామణి, ఏఓ సురేష్, పీఈటీ హుస్సేన్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కేసు నమోదు చేస్తాం


ఎస్సై ఒబయ్య

నాగలాపురం: డిసెంబర్ 31 రాత్రి ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఓబయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, పట్టుపడితే జైలుకే అని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులకు భంగం కలిగిస్తే ఉపేక్షించమన్నారు. ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. డిసెంబరు 31వ రోజు రాత్రి న్యూయర్ వేడుకలు ముగిసేవరకు పూర్తిస్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి శబ్దాలు చేస్తూ రోడ్లపైకి వచ్చి అల్లర్లు చేస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు.

స్విమ్స్‌లో చిన్నపిల్లలకు ఉచిత టీకా

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల పిడియాట్రిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు చిన్నపిల్లలకు రోగనిరోధక టీకాలు ఉచితంగా వేయనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రతి నెలా 1 నుంచి 7వ తేదీ వరకు ఉచిత టీకాలు వేయనున్నట్లు తెలియజేశారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి పదేళ్ల వయస్సులోపు పిల్లలకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఉచితంగా టీకాలను రూం నెంబర్ 13లో ఓపీ సమయంలో మాత్రమే వేస్తామన్నారు. ఇందులో బీసీజీ, ఓపీవీ, హైపటైటిస్–బీ, పెంటావ్యాక్, రోటావైరస్, న్యూమోకోక్కల్ కాంజుగేట్ వ్యాక్సిన్, ఐపీవీ, మీజిల్స్–ఎమ్, జేఈ, టీడీ, డీపీటీ వంటి టీకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఈరోజు

గడప గడపకు మన ప్రభుత్వం

శ్రీకాళహస్తి: పట్టణంలోని 23వ వార్డు పరిధిలో కొండమిట్ట, పాల డిపో ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిర్వహించనున్నట్టు పార్టీ కార్యాలయం తెలిపింది.

నూతన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

ఏర్పేడు: స్థానిక నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రారంభించనున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య శనివారం తెలిపారు. రూ.57 లక్షలతో 11 నూతన గదులను నిర్మించినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సుస్థిర ప్రగతిలో శ్రీసిటీకి పెద్దపీట

- శ్రీసిటీకి కలిసొచ్చిన 2023
- రూ.9 వేల కోట్ల కొత్త పెట్టుబడులు, 21,500 ఉద్యోగాల కల్పన
- 18 కొత్త పరిశ్రమల స్థాపన, 7 పరిశ్రమల విస్తరణ
- భవిష్యత్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు


విశాఖలో నిర్వహించిన జీఐఎస్ సదస్సులో శ్రీసిటీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)


శ్రీసిటీలో పరిశ్రమలను సందర్శిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి (ఫైల్)


ఎస్ఎస్ రోల్స్ పరిశ్రమ ఉత్పత్తులు ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)


శ్రీసిటీలోని మోండెలెజ్ ప్లాంట్ విస్తరణకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

వరదయ్యపాళెం: దేశంలో ప్రముఖ సమీకృత వ్యాపార కేంద్రంగా కీర్తి గడించిన శ్రీసిటీ, 2023లోనూ జోరుగా తన ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగించింది. ప్రపంచవ్యాప్త పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన ఆర్థికవృద్ధి కేంద్రంగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. పలు నూతన పరిశ్రమల శంకుస్థాపన, ప్రారంభోత్సవ వేడుకలు, ప్రముఖులు, ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధుల సందర్శనలతో సహా అనేక వినూత్న కార్యక్రమాలతో ఏడాదంతా బిజీబిజీగా గడిపింది. శ్రీసిటీ ప్రస్థానంలో 2023 మరో ముఖ్యమైన సంవత్సరంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభివర్ణించారు.

ముఖ్య ఘటనలు

- జులై 25న మోండలెజ్ ప్లాంట్ విస్తరణ శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ మోడ్‌లో పాల్గొన్నారు. దీని పెట్టుబడి విలువ రూ.1600 కోట్లు కాగా, 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు, 18వేల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది.
- మార్చి 3న విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)–2023లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శ్రీసిటీ స్టాల్‌ను ప్రారంభించారు.
- మే 30న పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అండ్ వాణిజ్యశాఖా మంత్రి గుడివాడ అమరనాథ్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, అడెలా ఎలక్ట్రికల్స్ సంస్థల కొత్త ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించారు.
- నవంబర్ 23న డైకిన్ ఇండియా రూ.వెయ్యి కోట్లతో నూతన ప్లాంట్‌ను ప్రారంభించింది. ఇది భారతదేశంలో సంస్థ 3వ యూనిట్, ఆగ్నేయాసియాలో అతిపెద్దది. ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలకు అనుగుణంగా ఈ పరిశ్రమను నెలకొల్పింది.




ఎంఓయూ చేసుకుంటున్న అడెలా ఎలక్ట్రికల్స్ (ఫైల్), డైకిన్ ఏసీల తయారీ పరిశ్రమ ప్రారంభం (ఫైల్)

పెట్టుబడి, ఉద్యోగాల సృష్టిలో గణనీయమైన వృద్ధి 2023లో శ్రీసిటీ అనుసరించిన చురుకైన మార్కెటింగ్ వ్యూహాలతో పాటు ప్రతిష్టాత్మక పలు వాణిజ్య ప్రదర్శనలలో పాల్గొనడం గణనీయమైన దేశ విదేశీ పెట్టుబడులను ఆకర్షించింది. వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)– 2023లో జరిగిన పెట్టుబడి ఒప్పందాలతో సహా మొత్తంగా ఏడాదిలో రూ.9 వేల కోట్ల పెట్టుబడులు, 21,500 కొత్త ఉద్యోగాలకు మార్గం సుగుమమైంది.

భూమి పూజలు, ప్రారంభోత్సవాలు


అవార్డును అందుకుంటున్న ప్రతినిధులు (ఫైల్)

భూమిపూజలు, నిర్మాణాలు, ప్రారంభోత్సవాలతో ఏడాదంతా పారిశ్రామికవాడ కళకళలాడింది. ఆరు కొత్త కంపెనీలు (ఎల్‌జీ పాలిమర్స్, ఎవర్‌షైన్ మౌల్డర్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్, త్రినాథ్ ఇండస్ట్రీస్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్) తమ ప్లాంట్ల నిర్మాణానికి పునాది వేశాయి. 18 నూతన పరిశ్రమలు (డైకిన్ ఎయిర్ కండిషనింగ్, హావెల్స్, ట్రియున్ టెక్నో ఫాబ్, యాక్సెలెంట్ ఫార్మా, బ్లూ స్టార్, టీహెచ్‌కే, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్, ఎయిర్‌మాస్టర్, ఈప్యాక్ డ్యూరబుల్స్, కింబర్లీ, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, అంబర్, అడెలా ఎలక్ట్రికల్స్, నీమ్రానా స్టీల్స్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఎల్ మెటర్ కన్వర్టర్లు, ఈస్కై కాంపొనెంట్స్) ఉత్పత్తులు ప్రారంభించాయి. ఇప్పటికే శ్రీసిటీలో కొలువైన ప్రముఖ కంపెనీలు వీఆర్వీ చార్ట్ ఇండస్ట్రీస్, జెన్ లినెన్, పార్కసన్ ప్యాకేజింగ్, టోరే, మోండెలెజ్, హేమిల్టన్ పరిశ్రమలు, వ్యాపార పురోగతిలో భాగంగా తమ ప్లాంట్లను విస్తరించాయి.

నాయకత్వ ప్రతిభ

శ్రీసిటీ లోపల కాకుండా, బయట కూడా పలు కార్యక్రమాల ద్వారా శ్రీసిటీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కించుకుంది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి నాయకత్వంలో భారతదేశం–జపాన్ వ్యాపార సహకార కమిటీ, ఇతర అంతర్జాతీయ వేదికలపై స్థిరమైన అభివృద్ధి, సమతుల్య భవిష్యత్ కోసం శ్రీసిటీ తన నిబద్ధతను చాటుకుంది. చెన్నైలో గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్–2023 సదస్సు నిర్వహణలోనూ స్పాన్సర్‌గా కీలక పాత్ర పోషించింది. వ్యాపార ప్రపంచంలో తన విజయాలకు గుర్తింపుగా పలు ప్రశంసలు, అవార్డులు అందుకుంది.

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)

శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్ (ఎస్‌జేసీఏ), టీహెచ్‌కే, హంటర్ డగ్లస్, ఐమాప్, డైకిన్ అల్యూమినియం, కెల్లాగ్స్, ఐఎఫ్ఎఫ్, మోండెలెజ్, ఇసుజు, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, బెర్గెన్ పైప్ సపోర్ట్స్, ఎవర్డస్ మొదలైన పరిశ్రమలు రూ.3.6 కోట్లకు పైగా సీఎస్ఆర్ ప్రాజెక్టులు చేపట్టి, విద్య, ఆరోగ్య సంరక్షణ, సమాజ అభివృద్ధికి తమవంతు సహకరించాయి.

సుస్థిరతకు పెద్దపీట

పర్యావరణ నిర్వహణలో శ్రీసిటీ నిబద్ధత, అమలు విధానాలు అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఈ చర్యల్లో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పలు వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఇండియాస్ మోస్ట్ ఇన్నోవేటివ్ సస్టైనబిలిటీ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్ అనే ప్రతిష్టాత్మక బిరుదును సంపాదించింది. ఈ గుర్తింపు పర్యావరణ వృద్ధి, స్థిరమైన అభివృద్ధిలో ప్రపంచ లీడర్‌గా శ్రీసిటీ స్థానాన్ని సుస్థిరం చేసింది.

కూల్ క్యాపిటల్‌గా ఆవిర్భావం

దేశంలో ఎయిర్ కండిషనరీ తయారీ కేంద్రంగా శ్రీసిటీ ఆవిర్భవించడం ఈ ఏడాదిలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ పరిణామం. డైకిన్, బ్లూస్టార్, అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, హావెల్స్ వంటి ప్రముఖ కంపెనీలు తమ పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. దేశీయ ఉత్పత్తిని పెంచి, దిగుబడులపై ఆధారపడడాన్ని తగ్గించాయి. అదనంగా ఈ కంపెనీలకు వివిధ ఉప పరికరాలు సరఫరా చేసే అనుబంధ కంపెనీల రాకతో ఇది కూల్ క్యాపిటల్‌గా మారింది.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మోహనప్రియ

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో ఎండీపుత్తూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి కుటుంబానికి ఉన్న పాడి ఆవు మృతి చెందింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.37,500 చెక్కును సర్పంచ్ బాధిత రైతుకు అందజేయడంతో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, దొరస్వామి, కేశవులు, రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటకు గంగ నీరు ప్లీజ్!

- ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కోరిన పవిత్రారెడ్డి


మంత్రి అంబటికి తాగునీటి సమస్యను వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: తెలుగు గంగ నీరు నిలిచిపోవడం వల్ల పది రోజులుగా రేణిగుంటలో తాగునీటి సమస్య ఉత్పన్నమైందని, గంగ నీటిని విడుదల చేసి పట్టణ ప్రజల దాహార్తి సమస్య తీర్చాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబును మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి కోరారు. రేణిగుంట విమానాశ్రయం ఆవరణలో ఆమె శనివారం మంత్రిని కలిసి సమస్యను నివేదించారు. దీనిపై ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో జిల్లా ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రేణిగుంటలో తాగునీటి సమస్య లేకుండా అందించామన్నారు. అయితే తెలుగుగంగ కాలువలో నీరు లేకపోవడంతో తలెత్తిన ఇబ్బంది దృష్ట్యా కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిందని, అయితే దీనిని ప్రతిపక్షాలు భూతద్దంలో చూపుతూ కువిమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రసూల్, వార్డు సభ్యుడు మణి తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో భక్తుల విడిది కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డును, టాయిలెట్ల నిర్మాణ పనులను శనివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, స్వామి అమ్మవార్ల దర్శనార్థం నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారన్నారు. వారి సౌకర్యార్థం పాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థలంలో షెడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, శివకిషోర్, బాలాజీ, ప్రతాప్ స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి 'సిపాయి భరోసా'


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం జింగిళిపాళెంలో ఇటీవల గ్రామస్తురాలు దుర్గమ్మ మృతిచెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శనివారం మృతురాలి భర్త ఢిల్లీని పరామర్శించారు. వారికి 40 సిపాయి భరోసా కింద వస్తువులతో కూడిన నిత్యావసర సరుకులు అందజేశారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, రత్నంరెడ్డి, వసంతరామిరెడ్డి, కిరణ్, ఆదిరెడ్డి, మునికుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మ పురవీధి ఉత్సవం



శ్రీకాళహస్తి: ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం వైభవంగా గొబ్బిదేవత పురవీధి ఉత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య పురవీధి ఉత్సవం సాగింది. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'నిఖా' కానుక పంపిణీ


ఎమ్మెల్యే నిఖా కానుకను అందజేస్తున్న ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రేణిగుంటలోని బుగ్గవీధికి చెందిన నూర్ ఇ చష్మికి వివాహం నిశ్చమైంది. వారిది నిరుపేద కుటుంబమని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి ద్వారా డబుల్‌కాట్ మంచం, బీరువాను శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. శనివారం శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. తొండమాన్‌పురం పంచాయతీ మిట్టవీధి గ్రామానికి చెందిన బుజ్జమ్మ(53) మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 15 నిందితురాలి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో ఆమెను హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం


కన్నావరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సత్యవేడు: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ..ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని ఏఎంపురం సర్పంచ్ ఎం.శిరీష అన్నారు. శనివారం ఏఎంపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన క్రీడలను ఆమె ప్రారంభించారు. మండల పరిధిలో కన్నావరం, ఏఎంపురం పంచాయతీల్లో జరిగిన బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలలో 12 జట్లు పాల్గొన్నాయి, అందులో 142 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, క్రీడాపోటీలను పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో పీడీలు మురళి, మణి, సతీష్, అపర్ణ, డిల్లీరాణి, స్వర్ణ, ప్రతిమ, నాగరాజు, పయనిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం


క్రీడా పోటీల్లో షీల్డులు అందుకుంటున్న గెలుపొందిన విద్యార్థులు


రేణిగుంట: ఆటలతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ అధినేత విక్రమ్ శాలీ అన్నారు. రేణిగుంట తపస్య స్కూల్ ఆధ్వర్యంలో సీఆర్ఎస్ క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా స్పోర్ట్స్ ఉత్సవ్ నిర్వహించారు. తమ స్కూల్ విద్యార్థులను 4 జట్లుగా విభజించి 450 మంది విద్యార్థులతో 25 ఈవెంట్స్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం సాయంత్రం స్కూల్ చైర్మన్ లలితమ్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అనుష, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సమాచారం ఇవ్వండి


సత్యవేడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: పంచాయతీల పరిధిలో ఏ ప్రాంతాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేసే వివరాలను ముందురోజు వార్డు ప్రజలకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి రూ.3 వేలు పింఛన్ అందజేయాలన్నారు. మండల పరిధిలో 131 కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో 7,442 పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, కొత్త పింఛన్లను 3వ తేదీ ఎమ్మెల్యే ద్వారా అందజేయాల్సి ఉందన్నారు. జనవరి 5వ తేదీ నుంచి మండలంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సరస్వతి

వరదయ్యపాళెం: ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను శనివారం ఎంఈఓ సరస్వతి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. నూతన ఏడాదిలో యూటీఎఫ్ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 గున్నయ్య, హెచ్ఎం రమణయ్య, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశికుమార్, సురేష్ భగవాన్, గౌరవాధ్యక్షుడు రాజమోహన్‌బాబు, సభ్యులు రుషేంద్రబాబు, కొండలరావు, మునిరాజ, సూర్యనారాయణ, రూపస్, రామారావు, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్

శ్రీకాళహస్తి: మండలంలోని అమ్మపాళెం దళితవాడకు చెందిన కిన్నెర పండయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పుల్లారెడ్డికండ్రిగ సర్పంచ్ యుగంధర్‌రెడ్డి ద్వారా రూ.10వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు.